# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## కాంగ్రెస్ తెచ్చిన కరువు

**ఇంతలో** ఎంత మార్పు! పచ్చనాకు సాక్షిగా ఆకలి తీర్చే రైతన్నకు ఎంతటి దురవస్థ! 'ఏడీ మా దూప తీర్చిన అపర భగీరథుడు' అని ఎండిన పొలాలు ఆక్రోశిస్తున్నాయి. ఆరిపోతున్న గడ్డిపోచల పెదాలను తడిపేందుకు రైతులు యుద్ధమే చేస్తున్నారు. బోరు మీద బోరు వేసినా నీరు ముఖం చాటేస్తున్నది. ట్యాంకర్లు తెచ్చిపోసినా సొమ్మసిల్లిన పొలం తెప్పరిల్లడం లేదు. ఎన్నిచేసినా వల్ల కాక రైతన్నలు కాడిని పడేస్తున్నారు. ప్రాణాలు విడుస్తున్నారు. ప్రజలను కడుపులో దాచుకుని కాపాడిన పెద్ద దిక్కు కేసీఆర్.. కాని రోజులు వస్తే చూస్తూ ఊరుకుంటారా? తను నాటిన మొక్క పచ్చగా ఎదుగుతుంటే హర్షించిన కర్షకుడు ఇప్పుడది దాహంతో ఆర్తనాదం చేస్తుంటే తపన పడకుండా ఎలా ఉంటాడు? అందుకే స్వరాష్ట్రాన్ని సాకారం చేసిన నేత, ప్రగతి పరుగుల తెలంగాణ విధాత రైతుల కోసం కదిలారు. ఎండిన పొలాలను చూసి గుండెదిటవు కోల్పోయిన రైతన్నలకు సాటిరైతుగా కేసీఆర్ ధైర్యం చెప్పారు. రైతన్నా నేనున్నానంటూ భుజం తట్టారు. ఇది కాలం వేసిన కాటు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ గర్జించారు. పంటలను ఎండబెట్టిన కాంగ్రెస్ నేతల అసమర్థ పాలనపై నిప్పులు చెరిగారు. రైతుల సమస్యల పరిష్కారానికి యుద్ధభేరి మోగించారు.

కల్లబొల్లి కట్టుకథల కాంగ్రెస్ పాలన తెలంగాణకు పీడకలగా తయారైంది. నిన్నటిదాకా నీరుపారిన తెలంగాణ తీరు మారింది. అసలు కథే తారుమారైంది. కళకళలాడిన తెలంగాణ వెలవెలబోయింది. పదేండ్ల క్రితం నాటి నీటిగోస మళ్లీ చుట్టుముట్టింది. కాంగ్రెస్‌తో కరువు జట్టుకట్టింది. జలకళతో మత్తళ్లు దుంకిన సంబురం ఎండిపోయి నెర్రెలు వారుతున్నది. భూమి దూప, మనిషి దూప ఒక్కసారిగా మిక్కుటమైనయి కాంగ్రెస్ పాలనలో. సుమారు పదేండ్ల పాలనలో కరెంటు కాంతుల్లో మెరిసి మురిసిన తెలంగాణ చీకట్ల పాలైంది. ప్రజల గోస తీర్చే లాలన పోయి పదవులు చూసుకుని మురిసే పాలన వచ్చింది.

ఎట్లుండె తెలంగాణ.. ఎట్లయింది తెలంగాణ? అనుకునే రోజులు అనతికాలంలోనే వచ్చిపడ్డాయి. కేసీఆర్ కండ్లల్ల ఒత్తులేసుకుని కాపుగాసిన తెలంగాణ నాలుగు నెలల్లోనే ఆగమైంది. లెక్కలేని హామీలతో గారడి చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా కాలయాపన చేయడం ఒక ఎత్తయితే.. సాగునీరు అందక నానాటికి రైతుల పరిస్థితి తీసికట్టు కావడం మరొక ఎత్తు. గంగ చిందులేసిన నేలమీద మంచినీరే గగనమయ్యే రోజులు వచ్చిపడ్డాయి. అధికార యావతో, అసమర్థ పాలనతో ప్రస్తుత పాలకులు తెలంగాణను తెర్లు చేశారు. తెలివి తక్కువతనంతో, చేతకానితనంతో దేనిని ఎట్లా వాడుకోవాలో తెలియని అర్భకత్వంతో రాష్ట్రాన్ని తెర్లు చేశారన్న కేసీఆర్ మాటలు అక్షర సత్యాలు. సర్కారు ఇప్పటికైనా మేల్కొని నీటి సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయాలి.

# ఢిల్లీ కీలుబొమ్మల కుట్రలిక సాగవు

తెలంగాణ ప్రజలు కండ్లు మూసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. ఎందుకంటే, రాష్ట్రంలో అవకాశవాద రాజకీయం బట్టలు విప్పి తిరుగుతున్నది. పాము తన కుబుసాన్ని వదిలించుకున్నంత సులువుగా వృద్ధ రాజకీయ నాయకులు కండువాలు మారుస్తూ రాజకీయ విలువలు, నైతికత అనే పదాలకు కొత్త భాష్యం చెప్తున్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు ఉన్నతమైన పదవులు, రాజభోగం అనుభవించి, అధికారం చేజారిన రెండు మూడు నెలల్లోనే నీడనిచ్చిన చెట్టుపై రాళ్లు విసురుతున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీ పంచన చేరుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆరే సరైన నాయకుడని, పార్టీలు మారుతున్న ఆ వృద్ధ నాయకులకూ తెలుసు.

జక్కు వెంకట్‌రెడ్డి

కేసీఆర్ అంటే తెలంగాణ. తెలంగాణ అంటే కేసీఆర్. నాడు కేసీఆర్ కాకుండా మరొకరు తెలంగాణకు ముఖ్యమంత్రి అయి ఉంటే సీమాంధ్ర ఆధారిత, అధిష్ఠాన బానిస రాజకీయ ముఠాలు, మీడియా ముసుగు తొడిగిన సీమాంధ్ర సంస్థలు ఈ పదేండ్లలో తెలంగాణను ఆగంచేసేవి. ఈ విషయం ఇప్పుడు రంగులు మారుస్తున్న ఊసరవె ల్లులకూ తెలుసు. కేసీఆర్ ఎప్పుడు బలహీనపడితే అప్పుడు రెక్కలు విప్పుకొని చెలరేగాలని చూస్తున్న వాళ్లకు ఫిరాయిం పుదారులు ఇప్పుడు పావులుగా మారారు. వాళ్లది అరువై ఏండ్ల బానిసత్వం. అందుకే అరువై ఏండ్ల రాజకీయ అనుభవంలో ఒక్కసారిగా కూడా ప్రత్యక్ష ఎన్నికల్లో గెలువని వాళ్లు పార్టీ మారితే.. 'కేసీఆర్‌కు భారీ షాక్' జబ్బలు చరుచుకోవడం అజ్ఞానమే అవుతుంది.

తెలంగాణలో మార్పు మొదలైందని అంటున్నారు. కానీ, గత పదేండ్ల పాటు మీ పొలిటికల్ రాజధాని హైదరాబాద్. ఇక నుంచి ఢిల్లీ అని గ్రహించలేకపోతున్నారు. అధిష్ఠానానికి బానిసలుగా బతికితే తప్పా, రాజకీయ భవిష్యత్తు శూన్యమైందనే మార్పును వాళ్లు గ్రహించలేకపోతున్నారు. వాస్తవానికి కాంగ్రెస్, బీజేపీల కుట్రలు, కుతంత్రాల గురించి నా లాంటి నవతరం నాయకుల కంటే ఔట్‌డేటెడ్ నాయకులకే ఎక్కువ తెలుసు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీది అధిష్ఠానం ఎజెండా అయితే.. బీజేపీది కార్పొరేట్ ఎజెండా. ఈ విషయం తెలంగాణ ప్రజల కంటే వాళ్లకే ఎక్కువ తెలుసు. కానీ, కేసీఆర్ ఎజెండా మాత్రం తెలంగాణ అని తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతి బిడ్డకు, మీ ఢిల్లీ పెద్దలకు కూడా తెలుసు.

గడిచిన పదేండ్లలో దేశంలోనే తెలంగాణ ఒక నమూనాగా నిలబడిందంటే అది కేసీఆర్‌తోనే సాధ్యమైంది. ఆరున్నర దశాబ్దాల పాటు దగాపడిన తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కేసీఆర్ చేసిన పోరాటం, కేసీఆర్ చేసిన త్యాగం, కేసీఆర్ చేసిన సాహసం ఏ ఒక్కరు కూడా ఏనాడు చేయలేదు. కారణం ఒక్కటే.. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నాయకులు మా బీఆర్ఎస్ పార్టీని వీడుతుంటే కేసీఆర్ చుట్టూ చేరిన చెదలు కొట్టుకుపోయి చెట్టంతా తేజ్‌గా కనిపిస్తున్నట్టుంది. కేసీఆర్ సారథ్యంలో టీఆర్ఎస్ వచ్చి తెలంగాణ రాష్ట్ర నినాదాన్ని ఎత్తుకునే వరకు కూడా వీళ్ల నోరు మెదపలేదు. కానీ, 'మేమే ముందు' అంటూ నేడు మీడియా ముందు ప్రకటనలు చేస్తుండటం విడ్డూరం.

కేసీఆర్ యావత్తు తెలంగాణ సమాజాన్ని ఏకం చేసిన నాయకుడు. పద్నాలుగేండ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా సాధించిన ప్రత్యేక తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని కండ్లముందుంచారు. ఈ అభివృద్ధిని గత పాలకులు గత అరువై ఏండ్లలో కూడా చేయలేకపోయారు. కేసీఆర్ కేవలం పదేండ్లలోనే చేసి చూపించారు. ఫలితంగా తెలంగాణ అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతున్నది. నాడు తెలంగాణ చీకటి అవుతుందన్న సీమాంధ్ర నాయకుల శాపనార్థాలను సవాలుగా స్వీకరించి నేడు తెలంగాణలో 24/7 వెలుగులు నింపిన కేసీఆర్ ఒక చరిత్ర. నాడు నెర్రెలు పడిన తెలంగాణ నేలపై అసాధ్యమనుకున్న సాగునీటి ప్రాజెక్టులను స్వరాష్ట్రంలో నిర్మించి తెలంగాణ మాగాణాన్ని పచ్చలహారంగా మార్చిన సంకల్పం కేసీఆర్‌ది.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ కోసం జరిగిన ఏ ఉద్యమంలోనూ కలసిరాలేదు. ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయలేదు. మీరు కూడా ఏ సందర్భంలోనూ ముందుకు రాలేదు. పైగా ఉద్యమకారులపై నిరంకుశత్వం ప్రదర్శించి పైశాచిక ఆనందం పొందిన చరిత్ర వాళ్లది. వాళ్ల ఢిల్లీ పెద్దల ముందు గట్టిగా మాట్లాడితే.. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకునేలోపే వాళ్ల పదవులు ఊడుతాయనే విషయం వారికి బాగా తెలుసు. అందుకే, తెలంగాణపై వాళ్లు పెదవి దాటని ప్రేమను చూపిస్తారు.

కేసీఆరే లేకపోతే తెలంగాణను ఆగం పట్టించుడు తెలంగాణ వ్యతిరేకులకు తేలిక అని ఇప్పటికే సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తేలిపోయింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నమ్మితే తెలంగాణ వ్యవసాయం చిల్లాకల్లమైంది. ఢిల్లీ పెద్దల చేతిలోని కీలుబొమ్మలతో తెలంగాణకు ప్రమాదమేనని గడిచిన మూడు నెలల్లో తేలిపోయింది. మీకు తెలంగాణ ప్రయోజనాలకంటే అధిష్ఠానం ప్రయోజనాలే ముఖ్యమయ్యాయని ప్రజలు గుర్తించారు. నీళ్లు, విద్యుత్తు సరఫరా సక్రమంగా లేని కారణంగా ఎండిన తెలంగాణ రైతు గుండెలకు భరోసా కల్పించిన కేసీఆర్ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ.. ప్రజలపక్షమేనని తేటతెల్లమైంది. ఎప్పటికైనా మనోడు మనోడే, మందోడు మందోడే అవుతాడన్నట్టుగా.. మతవాదాన్ని ముందేసుకున్న బీజేపీతో, అసత్యాలను ముందేసుకున్న కాంగ్రెస్‌తో తెలంగాణకు ఒనగూరే ప్రయోజనం ఏమి లేదు. సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించడం కోసం కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు చేయని ప్రయత్నం లేదు. ప్రధాని మోదీ వాస్తవ, సంక్షోభ పరిస్థితులను విస్మరిస్తూ కేవలం భావోద్వేగాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. ఆయనకు ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి సంబంధించిన అంశాలతో పనిలేదు. కేవలం భావోద్వేగాలతో దేశాన్ని ఒక మత్తులో ముంచేసి ముందుకు నడిపించాలనుకుంటున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ చేసిన భ్రష్ట రాజకీయాలన్నీ ఇప్పుడు బీజేపీ చేస్తున్నది. ఈ రెండు పార్టీల వల్ల తెలంగాణ గడ్డ పరిస్థితుల్లో కూరుకుపోవడం ఖాయం. తెలంగాణ వ్యతిరేకులు, రాష్ట్ర విభజనను జీర్ణించుకోలేని శక్తులు ఇప్పుడు తెలంగాణపై దండయాత్ర మొదలుపెట్టాయి. కేసీఆర్‌ను దించినమని సంబురపడుతున్నాయి. కేసీఆర్ ఒంటరి అయ్యాడని జబ్బలు చరుచుకుంటున్నాయి. కానీ.. ఈ రెండు పార్టీల మెడలు వంచి ప్రపంచంలోనే తెలంగాణ అనే ఒక ప్రత్యేకమైన జియోగ్రాఫికల్ ఏరియాను సృష్టించిన యోధుడు కేసీఆర్.

తెలంగాణ తెచ్చిన కేసీఆర్ వెంట యావత్తు రాష్ట్రం ఉన్నది. కేసీఆర్ ఎన్నడూ ఒంటరి కాదు. ఆయన పేరు చెప్తేనే బీజేపీ, కాంగ్రెస్ వెన్నులో వణుకు పుడుతుంది. తెలంగాణ జీవిక కేసీఆర్. తెలంగాణ అంటేనే కేసీఆర్, కేసీఆర్ అంటేనే తెలంగాణ. ఎవరెన్ని కుట్రలు చేసినా.. తెలంగాణ ప్రజలు వాటిని బద్దలు కొట్టడానికి సిద్ధంగా ఉన్నారు. తెలంగాణలో ఏదో జరిగిపోతోందన్న ఒక భ్రమను, అబద్ధాన్ని ప్రచారంలో పెట్టి ఎన్నికలలో లబ్ధి పొందాలనుకుంటున్న కుటిల రాజకీయాలను ఎదుర్కొనేందుకు తెలంగాణ పౌరసమాజం క్రమంగా ఏకమవుతున్నది. ఎవరో ఆడించే కీలుబొమ్మలు, తోలుబొమ్మల చేతికి తెలంగాణ భవిష్యత్తును పెట్టి రాష్ట్ర ప్రజలు ఆగమయ్యారు. కానీ, పార్లమెంట్ ఎన్నికలలో ఆ పరిస్థితి పునరావృతం కాదు. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని ప్రజలకు ఇప్పటికే అర్థమైంది.

(వ్యాసకర్త: మేయర్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్)

# మానవీయ నేతలే సమాజానికి శ్రీరామరక్ష

ప్రస్తుత వ్యాపార రాజకీయ ఎడారిలో ఇసుక కొండల వంటి రాజకీయ నేతలను కాకుండా, ఒయాసిస్ లాంటి మానవీయ నేతలను గుర్తించి కాపాడుకోవడమే ప్రజలకు శ్రీరామరక్ష. అరుదుగానైనా మానవీయ నేతలు ఉన్నారు. నాడు కాంగ్రెస్ కార్పొరేట్ పాలనను ధిక్కరిస్తూ పేదల శ్రేయోభిలాషిగా టీడీపీని స్థాపించారు ఎన్టీఆర్. కాంగ్రెస్ కార్పొరేట్ దోపిడీ నుంచి తెలంగాణ విముక్తి కోసం టీఆర్ఎస్‌ను స్థాపించారు కేసీఆర్. చావు అంచుల దాకా వెళ్లి తెలంగాణను సాధించడమే కాదు, విద్యుత్తు, వ్యవసాయం, పారిశ్రామిక సంక్షోభాలకు తాళలేక పొట్ట చేత పట్టుకుని పేదలు వలసెత్తిన ఆకలి తెలంగాణను కేవలం తొమ్మిదిన్నరేండ్లలో కరోనా కష్టాలను దాటుకొని మరీ భారత ధాన్యాగారంగా తీర్చిదిద్దారాయన. దటీజ్ కేసీఆర్.

పాతూరి వేంకటేశ్వరరావు
98490 81889

నాడు విదేశీయులు బహూకరించిన ట్రాక్టర్‌ను వినియోగించుకోవడం చేతగాక పొలాల్లో వదిలేసిన అనాగరిక రైతు రష్యాను దశాబ్ద కాలంలోనే అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపగలిగిన అగ్రరాజ్యంగా తీర్చిదిద్దారు. ఆయనే స్టాలిన్. మనకన్నా ఎక్కువ జనాభాతో, కరువు కాటకాలతో తల్లడిల్లుతున్నప్పుడు చైనా గద్దెనెక్కారు డెంగ్ సియావో పింగ్. స్టాలిన్ మార్గంలో ఆహార ధాన్యాల స్వయం సమృద్ధి దిశగా వ్యవసాయాభివృద్ధి చేయాలని నడుం బిగించిన ఆయన.. ఐదేండ్ల పాటు బడ్జెట్‌లో 90 శాతం నిధులను వ్యవసాయ రంగానికే కేటాయించారు. ఆనకట్టలు, రిజర్వాయర్లు, హైబ్రిడ్ వంగడాలు, రైతులకు ప్రోత్సాహకాలతో ఆకలితో అలమటిస్తున్న చైనాను అన్నపూర్ణగా రూపొందించారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచారు. దాంతో దేశవిదేశాల పారిశ్రామికవేత్తలు రెక్కలు గట్టుకొని మరీ పెట్టుబడులు పెట్టేందుకు చైనాలో వాలిపోయారు. అలా వ్యవసాయాభివృద్ధి ద్వారా పారిశ్రామిక ప్రగతిని సాధించి, అమెరికాకు దీటైన ప్రపంచాగ్ర దేశంగా చైనాను తీర్చిదిద్దారు డెంగ్ సియావో పింగ్.

అధ్యయనశీలి అయిన కేసీఆర్ రష్యా, చైనాల మార్గంలో పయనిస్తూ 'మిషన్ కాకతీయ' పేరిట చెరువులను పునరుద్ధరించారు. కాలువలు, రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టారు. వందల మీటర్ల లోతులో ఉన్న నదీ జలాలను కొండంత ఎత్తున్న తెలంగాణకు మళ్లించవచ్చని ఆరు దశాబ్దాల పాటు పాలించినవారిలో ఏ ఒక్కరైనా ఊహించారా? 'నాలుగు పుస్తకాలు చదివి తానే తెలివిగలవాడినని కేసీఆర్ అనుకుంటున్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి వెక్కిరిస్తున్నారు. పుస్తకాలను కాదు, సీఎం సారూ! తెలంగాణ అణువణువును అధ్యయనం చేసిన ఏకైక నేత కేసీఆర్. అందుకే ఆయన తెలంగాణ పిత. స్టాలిన్, డెంగ్, కేసీఆర్ వంటి దార్శనిక ప్రజానేతల్లో కామన్‌గా ఉండే విశిష్ట లక్షణం ఏమిటంటే.. 'తన బిడ్డ దేహం పట్ల పూర్తి అవగాహన గల తల్లిలాగే రష్యాలోని ప్రతి గ్రామం పట్ల స్టాలిన్‌కు, చైనాలోని ప్రాంతాలన్నింటిపై డెంగ్‌కు, తెలంగాణలోని ప్రతి పల్లె పట్ల కేసీఆర్‌కు పూర్తి అవగాహన ఉంది. అంతే కాదు, సగటు పాలక నేతల్లా.. ఆశల కోసం కాదు,

ఆశయ సాధన కోసం రాజకీయాన్ని చేపట్టిన నేతలు వాళ్లు. అందువల్లనే అతి స్వల్పకాలంలో రష్యాను స్టాలిన్, చైనాను డెంగ్ ప్రపంచ దేశాలుగా, తెలంగాణను కేసీఆర్ భారతాగ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దారు.

కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న దురుద్దేశంతో నోటి దగ్గరకు వచ్చిన పంటచేలను కాంగ్రెస్ పాలకులు ఎండబెట్టారు. అదే మీ స్థానంలో కేసీఆర్ ఉండి ఉంటే తక్షణమే కుంగిన పిల్లర్ల పటిష్టతకు ఆదేశించేవారు. పక్కాగా కాపర్‌డ్యాం నిర్మించేవారు. నీళ్లను ఎత్తిపోయించి, చెరువులు నింపి, పంటచేలకు నీళ్లు పారించేవారు. కానీ, మీరు మాత్రం రైతుల కళ్లలో నీరు పారించారు. మార్పు అంటే ఇదేనా సీఎం సారూ! మానవీయ నేతకు, రాజకీయ నేతకు తేడా ఏంటో ఇప్పుడు తెలిసొచ్చింది తెలంగాణ ప్రజలకు.

నాడు 'ప్రపంచానికే ప్రమాదకారి నాజీ హిట్లర్' అని గుర్తించిన తొలి నేత స్టాలిన్. ఐరోపా దేశాలన్నీ కూటమిగా ఏర్పడి హిట్లర్ కుయుక్తులను తిప్పికొడదామని ఆయనే మొదట ప్రతిపాదించారు. అయితే సోషలిస్టు రష్యా పతనాన్ని కాంక్షిస్తున్న బ్రిటన్ తదితర దేశాలు దాన్ని తిరస్కరించాయి. ముందుచూపుతో హిట్లర్‌తో సంధికి స్టాలిన్ అంగీకరించారు. సంధికాలాన్ని రష్యా పటిష్టతకు, ఆయుధాల ఉత్పత్తికి సద్వినియోగం చేసుకున్నారు. స్టాలిన్ ఊహించినట్టే సంధిని అతిక్రమించిన హిట్లర్ సేనలు రష్యాపై విరుచుకుపడ్డాయి. తానే ముందుండి ఎర్ర సైన్యంతో ప్రతిఘటించిన స్టాలిన్ నాజీలను తరిమికొట్టారు. రష్యాతో పాటు ఐరోపా దేశాలకు విముక్తి కలిగించారు. దటీజ్ స్టాలిన్.

నేడు 'మత విద్వేషపు బీజేపీ భారత్ దేశానికే ప్రమాదకారి' అని గుర్తించిన తొలి ప్రాంతీయ నేత కేసీఆర్. ముందుచూపుతో బీజేపీతో లౌకికంగా వ్యవహరిస్తూ 'తెలంగాణ' అనే శిశువును మొదట పటిష్ఠపరుచుకున్నారు. అనంతరం ప్రాంతీయ పార్టీలన్నీ కూటమిగా ఏర్పడి బీజేపీని ప్రతిఘటిద్దామని ప్రతిపాదించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల తరఫున పోటీ చేసిన నాయకుడిని తెలంగాణకు రప్పించి బలపరిచిన ఏకైక ప్రాంతీయ పార్టీ నేత కేసీఆరే. అమరులైన రైతు ఉద్యమకారుల కుటుంబాలకు చేయూతనిచ్చిన ఏకైక ప్రాంతీయ నేత కేసీఆరే. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీని అవమానించిన బీజేపీని ఎండగట్టింది కేసీఆరే. 'మోదీ గారు! మీరు ప్రైవేటీకరించిన వాటిని తిరిగి మేం జాతీయం చేస్తాం. వ్యవసాయాభివృద్ధికి, రైతులకు, కూలీలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తాం. తద్వారా భారతదేశాన్ని ప్రగతి ప్రథంలో పయనింపజేస్తాం' అంటూ బహిరంగంగా బీజేపీకి సవాలు విసిరిన ఏకైక ప్రాంతీయ నేత కేసీఆర్. తెలంగాణ ఎమ్మెల్యేలను కొనేందుకు బీజేపీ చేసిన కుట్రను బయటపెట్టింది కేసీఆరే.

అటువంటి దార్శనిక ప్రజానేత కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను బీజేపీకి 'బీ టీమ్' అంటూ రాహుల్‌గాంధీతో సహా విజ్ఞులైన కొందరు వామపక్ష నేతలు, మేధావులు కూడా విమర్శించడం తెలంగాణకే కాదు, భారతదేశానికే దురదృష్టకరం. 'ప్రతిపక్షాలు, మీడియా, సోషల్ మీడియా చేసిన అబద్ధాల ప్రచారాన్ని నమ్మి నిండు మంచినీటి కుండను బోర్లించుకున్నాం' అని ఇప్పుడు బావురుమంటున్నారు తెలంగాణ ప్రజలు.

ప్రియమైన తెలంగాణ ప్రజలారా! కొందరు ఎప్పుడూ చంద్రుడిలోని మచ్చల్నే చూపుతుంటారు. వాళ్లను పట్టించుకోకండి. సూర్యుని వేడిని తాను భరిస్తూ, ప్రాణులకు చంద్రుడు ప్రసాదిస్తున్న చల్లని వెలుగులను ఆస్వాదిస్తూ సేద తీరండి. దయచేసి వాస్తవాన్ని విస్మరించకండి. వర్తమాన రాజకీయ వ్యాపార వ్యవస్థలో కేసీఆర్ వంటి అరుదైన దార్శనిక, మానవీయ నేతలను బలపరుచుకోవడమే కులమతాలకు అతీతంగా తెలంగాణలోని అన్నదాతలు, పేదలకు శ్రీరామరక్ష.

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సొంతంగా 370కి పైగా స్థానాల్లో గెలుస్తామని, కూటమి పార్టీలతో కలిపి 400 సీట్లు సాధిస్తామని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఊదరగొడుతున్నది. అయితే ఈ ప్రకటన కేవలం మేకపోతు గాంభీర్యంగానే కనిపిస్తున్నది. ఒకవేళ అదే నిజమైతే ఆ పార్టీ కుట్ర రాజకీయాలకు ఎందుకు తెరలేపినట్టు? కూటముల కోసం ఎందుకు వెంపర్లాడుతున్నట్టు? పైకి గప్పాలు కొడుతున్నారే గానీ, బీజేపీ పాలకులకు కూడా ఓటమి భయం వెంటాడుతున్నది. ఎన్నికల వేళ విపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేస్తుండటమే అందుకు నిదర్శనం.

# బీజేపీ మేకపోతు గాంభీర్యం

ప్రశాంత్ సాగి
70955 83999

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి సహా బీజేపీకి చెందిన హేమాహేమీలు ఎంతగా ప్రచారం చేసినా ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్‌ను అడ్డుకోలేకపోయారు. రోజురోజుకు బలపడుతూ పంజాబ్‌లోనూ అధికారం చేజిక్కించుకోవడమే కాకుండా పక్క రాష్ట్రాలకు ఆప్ విస్తరిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ దూకుడును కట్టడి చేసేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించినట్టు ఆరోపణలున్నాయి. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేయగా, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంట్ సభ్యత్వం కూడా రద్దయింది. దీనంతటి వెనుక బీజేపీ వ్యూహం ఏమంటే మూడోసారి కూడా దేశంలో అధికారంలోకి రావడమే.

కేవలం ప్రతిపక్ష నేతలపైనే విరుచుకుపడే దర్యాప్తు సంస్థలు.. అధికార పార్టీ నేతలపై అసలు కేసులే నమోదు చేయడం లేదు. ఒకవేళ నమోదైనా ఎలాంటి విచారణ జరగదు. ఇంకా విచిత్రం ఏమంటే ఎన్ని అవినీతి కేసులున్నా బీజేపీలో చేరిన వెంటనే అవి మాఫీ అవుతాయి. హిమంత బిశ్వశర్మ, సువేందు అధికారి, సుజనాచౌదరి, సీఎం రమేష్, గాలి జనార్దన్‌రెడ్డి, అజిత్ పవార్ ఇలా ఎందరో నేతలు కమలం తీర్థం పుచ్చుకొని పునీతులైనవారే.

నాయకులే కాదు, కేంద్ర దర్యాప్తు సంస్థలు సోదాలు నిర్వహించిన వెంటనే పలు కంపెనీలు కూడా బీజేపీకి దాసోహమవుతున్నాయి. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఆ పార్టీకి భారీగా నిధులు ఇచ్చి తమపై వచ్చిన ఆరోపణల నుంచి ఉపశమనం పొందుతున్నాయి. సీబీఐ, ఐటీ, ఈడీ లాంటి సంస్థలు కేసులు నమోదు చేసిన 41 కంపెనీలు రూ.2,471 కోట్లను బీజేపీకి విరాళంగా ఇచ్చిన విషయం ఎన్నికల బాండ్ల ద్వారా వెలుగులోకి వచ్చింది.

ఇదంతా నాణేనికి ఒకవైపు కాగా.. నాణేనికి మరోవైపు దేశంలోని చిన్నాచితకా పార్టీలను నయానో, భయానో లొంగదీసుకొని తనవైపు తిప్పుకొనేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. గత వైరాలను కూడా మర్చిపోయి పాత మిత్రులను బీజేపీ అక్కున చేర్చుకుంటున్నది. వాటితో పొత్తు కోసం వెంపర్లాడుతున్నది. అజిత్ పవార్‌పై ప్రధాని మోదీ అవినీతి ఆరోపణలు చేసిన కొద్ది రోజులకే ఆయన బీజేపీ కూటమిలో చేరిపోయారు. పోలవరం ప్రాజెక్టులో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని గతంలో ఆరోపించి.. నేడు ఆ పార్టీతో కలిసి బీజేపీ ఏపీలో పోటీ చేస్తున్నది. బీహార్‌లో నితీశ్‌తో, యూపీలో చిన్న పార్టీలతో కమలం పొత్తు పెట్టుకున్నది.

400 సీట్లు గెలిచే అవకాశం ఉన్నప్పుడు పార్టీలతో పొత్తులెందుకు? ఓవైపు ఎన్డీయే కూటమిలో కొత్త మిత్రులను కలుపుకొంటూనే.. ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేసే కుట్రలకు తెరలేపారు. తెలంగాణలో బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తు బెడిసికొట్టడానికి కమలం అధిష్ఠానమే కారణమని ఆరోపణలు వెల్లువెత్తాయి. రెండు పార్టీల మధ్య పొత్తు పొడవకుండా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై తీవ్రంగా ఒత్తిడి చేయడంతో ఆయన బీఎస్పీని వీడాల్సి వచ్చింది.

యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఆ రాష్ట్రంలో గతంలో వచ్చినట్టు ఈసారి బీజేపీకి భారీగా ఎంపీ సీట్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మహారాష్ట్రలో పార్టీల చీలికలతో బీజేపీపై మరాఠాలు గుర్రుగా ఉన్నారు. అక్కడ కూడా గతంలో సాధించిన సీట్లను తిరిగి చేజిక్కించుకునే పరిస్థితుల్లేవు. పదేపదే కూటముల మార్పుతో నితీశ్ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో జరిగిన తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాలు గణనీయమైన ఓట్లు, సీట్లను సాధించాయి. గుజరాత్‌లో అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఇద్దరు పోటీ నుంచి తప్పుకొన్నారంటేనే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కేజ్రీవాల్ అరెస్టు ప్రభావం ఢిల్లీ, పంజాబ్ రాజకీయాలపై పడొచ్చు. ఇక దక్షిణాది సంగతికి వస్తే.. కర్ణాటకలో పరిస్థితులు కాస్త అనుకూలంగా ఉన్నా.. తెలంగాణలో గతంలో వచ్చిన సీట్లు గల్లంతయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. పైకి ప్రచారం చేస్తున్నట్టు.. దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవనే చెప్పాలి. అందుకే మరోసారి ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఉద్దేశంతోనే కూటములు కడుతూ, ప్రతిపక్ష పార్టీలను చీలుస్తూ, విపక్ష నేతలను అరెస్టు చేయిస్తూ అడ్డదారిలో వెళ్తుండటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.

## సీఎం సీటుకే ఎసరు!

నా భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉన్నది. మన పార్టీ లోక్‌సభ అభ్యర్థిని అరువై వేల మెజారిటీతో గెలిపించండి. ఎంపీ అభ్యర్థి గెలిస్తేనే నేను పూర్తికాలం సీఎంగా ఉంటాను. చేతులు జోడించి మొక్కుతున్నా.. లేకుంటే నా సీఎం సీటుకే ఎసరు వస్తుంది.

- సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి